## అధ్యాయము 1

# ఇశ్రాయేలీయులు ఐగుప్తులో బానిసలగుట

నిర్గమకాండము ఐగుప్తు నుండి ఇశ్రాయేలీయుల విమోచన గూర్చి మాట్లాడుతుంది. "ఇశ్రాయేలు కుమారులు" ఎప్పుడు ఎలా ఐగుప్తుకు వచ్చారో జ్ఞాపకం చేస్తూ పుస్తకం ఆరంభమవుతుంది (1:1-5). భయంకరమైన కరువు సమయంలో యాకోబు మరియు అతని కుటుంబం సారవంతమైన నైలు ప్రాంతములో స్థిరపడ్డారు. యాకోబు కుమారులలో ఒకరైన యోసేపు ద్వారా దేవునిచే రానున్న కరువును గూర్చి హెచ్చరించబడి ఐగుప్తు గొప్ప మొత్తములో ధాన్యమును నిలువచేసింది (ఆది. 41).

దేవుని ప్రజలకు విమోచన యొక్క అవసరత ఎందుకు వచ్చిందో చెబుతూ కథ కొనసాగుతుంది. ఐగుప్తీయులు వారిని చూసి భయపడ్డారు కాబట్టి వారిని బానిసలుగా చేశారు. కాలక్రమంలో, ఇశ్రాయేలీయులు ఫలించి అభివృద్ధి చెందారు (1:6, 7). క్రొత్త రాజు ఒకడు వచ్చాడు, మరియు అతడు "యోసేపును ఎరుగడు" (1:8; KJV); అనగా, కరువు కాలములో ఐగుప్తుకు సహాయం చేయుటకు యోసేపు ఏమి చేశాడో అతడు జ్ఞాపకము చేసుకోలేదు లేక గుర్తించలేదు. శత్రువులు వారిపై దాడి చేసినప్పుడు వారి కంటే ఎక్కువ సంఖ్యలో మరియు బలముతో ఉన్న హెబ్రీయులు వారికి విరోధులవుతారని ఐగుప్తీయులు భయపడ్డారు (1:9, 10).

ఆ తరువాత, ఐగుప్తీయులు - ముఖ్యంగా ఫరో - ఈ "ఇశ్రాయేలీయుల సమస్యను" పరిష్కరించుటకు ప్రయత్నించాడు. వారు చేసినది ఏది ఫలించలేదు; అన్ని చేసినా, ఇశ్రాయేలీయులు అభివృద్ధి చెందుట ఆగలేదు.

మొదటిగా, ఐగుప్తీయులు ఇశ్రాయేలీయులను అణచివేశారు. కాని, దేవుని ప్రజలు ఎంతగా అణచబడితే, అంతగా ఫలించారు. తరువాత ఫరో ఇశ్రాయేలీయులు మరింత కష్టముతో పని చెయ్యాలని కోరాడు, కాని అది కూడా సమస్యను పరిష్కరించలేదు (1:11-14).

రెండవదిగా, మగశిశువులనందరిని చంపమని ఫరో హెబ్రీయుల మంత్రసానులకు ఆజ్ఞాపించాడు. అయితే, మంత్రసానులు ఫరో యొక్క ఉద్దేశాలకు భంగం కలిగించారు. వారు శిశువులను చంపలేదు, మరియు పిల్లలు ఎందుకు చనిపోలేదో వివరించుటకు వారు ఫరోకు అబద్ధము చెప్పారు. అందువలన, ప్రజలు అభివృద్ధి చెందారు మరియు

దేవుడు మంత్రసానులను దీవించాడు (1:15-21).

మూడవదిగా, నూతనముగా జన్మించిన హెబ్రీ మగ శిశువులందరినీ నదిలో పారవేయమని ఫరో కోరాడు. ఈ ప్రణాళిక యొక్క తుది పరిణామం ఏమిటంటే, విమోచకుడు కావలసిన శిశువు స్వయంగా ఫరో కోటలోనే పెరిగాడు (1:22-2:10).

ఈ కథనము యొక్క అంశం ఏమిటంటే మానవుడు దేవుని ఎదురించినప్పుడు ఏ ప్రణాళిక పని చేయదు. చివరికి ఫరో కూడా దేవుని ఎదుట నిలువలెకపోయాడు. దేవుని ఎవ్వరు జయించలేరు.

## ఇశ్రాయేలీయులు ఐగుప్తులో ప్రవేశించుట మరియు అక్కడ ఫలించుట

## (1:1-7)

**[1]ఐగుప్తులోనికి యాకోబుతో వచ్చిన ఇశ్రాయేలీయుల పేరులు ఏవనగా, రూబేను షిమ్యోను లేవి యూదా ఇశ్శాఖారు జెబూలూను బెన్యామీను. [2-5]దాను నఫ్తాలి గాదు ఆషేరు. వీరిలో ప్రతివాడును తన తన కుటుంబముతో వచ్చెను. యాకోబు గర్భమున పుట్టినవారందరు డెబ్బదిమంది. అప్పటికి యోసేపు ఐగుప్తులో ఉండెను. [6]యోసేపును అతని అన్నదమ్ములందరును ఆ తరము వారందరును చనిపోయిరి. [7]ఇశ్రాయేలీయులు బహు సంతానము గలవారై అభివృద్ధి పొంది విస్తరించి అత్యధికముగా ప్రబలిరి; వారున్న ప్రదేశము వారితో నిండి యుండెను.**

**వచనములు 1-5.** ఈ పట్టిక నిర్గమకాండము యొక్క ఆరంభమును ఆది. 46:8-27తో జతపరుస్తుంది. ఇది కూడా **పేరులు ఏవనగా అను** మాటతో ఆరంభమై అదే సంఖ్యగల ప్రజలతో ముగుస్తుంది. ఇక్కడ **ఇశ్రాయేలు యొక్క** పదకొండు **కుమారులను** గూర్చి ఇవ్వబడెను, యోసేపు ముందుగానే ఐగుప్తులో నివసిస్తున్నాడు కాబట్టి అతడు మినహాయించబడెను. దేవుడు ఎన్నుకొన్న ప్రజలు "ఇశ్రాయేలు" అని పిలువబడ్డారు (יִשְׂרָאֵל, *Yiśra'el*), ఇది **యాకోబు**కు ఇవ్వబడిన పేరు (ఆది. 32:38; 35:10), మరియు ఈయన కుమారులు పన్నెండు గోత్రములకు మూలపురుషులు. వారి వారి తల్లుల ఆధారంగా ఈ కుమారులు జనన క్రమములో ఇవ్వబడ్డారు: లేయా, రాహేలు, బిల్హా, మరియు జిల్పా (ఆది. 35:23-26).

ఐగుప్తుకు **డెబ్బది** మంది వెళ్లారని వాక్యము చెబుతుంది, కాని స్తెఫను డెబ్బది - ఐదు మంది అని చెబుతున్నాడు (అపొ. 7:14). ఈ తేడాకు కారణం ఏమిటి? స్తెఫను "సెప్టుజెంట్ లో ఉన్న విస్తరించిన సంఖ్యను ఇచ్చుటకు కోరాడని"[1] Gleason L. Archer, Jr. సూచిస్తున్నాడు, మరియు దానిలో నిర్గమకాండములో ఉన్న డెబ్బదికి బదులుగా డెబ్బది - ఐదు ఉంది. సెప్టుజెంట్ లో ఉన్న సంఖ్యలో యోసేపు యొక్క మనుమళ్లు కొందరు జోడించబడియుండవచ్చు అని కూడా ఆయన చెప్పాడు.[2] ఏ సంఖ్య అయినా - డెబ్బై లేక డెబ్బై అయిదు - మొత్తములో ఎవరిని లెక్కించారు అను దాని ఆధారంగా సరైనదే.

**వచనములు 6, 7.** ఆరంభములో, యాకోబు కుమారులు ఐగుప్తులో గౌరవనీయులైన అతిథులుగా ఉండి అక్కడ ఫలించారు. దేవుడు వారిని దీవించి ఆ విధంగా అభివృద్ధి చేసినప్పుడు, అబ్రాహాముతో ఆయన చేసిన వాగ్దానం నేరవేరింది (ఆది. 12:2; 15:5; 17:1-8). ఇశ్రాయేలు దేశములో ఎంతమంది ఉన్నారు? విమోచన తరువాత సుమారుగా 6,0,000 మంది పురుషులు లెక్కించబడ్డారు (12:37; 38:26).

వ్యాఖ్యానకర్తలు నిర్గమ. 1:7 మరియు ఆది. 1:28 మధ్య పోలికలను చూపిస్తారు: "దేవుడు వారిని ఆశీర్వదించెను; ఎట్లనగా - మీరు ఫలించి అభివృద్ధిపొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోపరచుకొనుడి." ఇశ్రాయేలీయులు **బహు సంతానము గలవారై అభివృద్ధి పొంది విస్తరించి . . . వారున్న ప్రదేశము వారితో నిండి యుండెను.** ఆరంభములో దేవుని చిత్తమును మానవునికి జ్ఞాపకము చేయుట దేవుడు నిర్గమకాండములో "నూతన సృష్టిని" చేస్తున్నాడని, ఆయన నొత్తయిన ప్రజలను సృష్టిస్తున్నాడని సూచిస్తుంది. అదే హెబ్రీ పదము (אֶרֶץ, *'erets*) ఆది. 1:28లో "భూమి" అని మరియు నిర్గమ. 1:7లో "ప్రదేశము" అని అనువదించబడుట గుర్తించవలసిన విషయము.

"వారున్న ప్రదేశము వారితో నిండియుండెను" అను మాట ఐగుప్తులో ఇశ్రాయేలీయులు నివసించిన ప్రాంతమైన గోషెనును సూచించవచ్చు (ఆది. 45:10). అది "మంచి ప్రదేశము . . . రామసేసు దేశము" (ఆది. 47:11).

దేవుని వాగ్దానాలలో ఒకటి నెరవేర్చబడుట ఇశ్రాయేలీయులు ఐగుప్తులో నివసించిన దానికి ఒక పరిణామం: అబ్రాహాము సంతతివారు ఫలించి ప్రబలారు. దేవుడు ఇశ్రాయేలును ఐగుప్తుకు ఆ కారణం చేతనే తీసుకొనివచ్చాడు అనుట సాధ్యమే. పితరుల కాపరి జీవితములో తిరుగులాడుట కంటే ఐగుప్తులో ఉన్న స్థిర జీవితం ఇశ్రాయేలీయులు ఎదిగి ఫలించుటకు మంచి వాతావరణమును ఇస్తుంది. ఇశ్రాయేలీయులు స్వయంగా ఐగుప్తు కాలమును ఇష్టంగా జ్ఞాపకం చేసుకొనుచు - లేక కనీసం ఐగుప్తు ఆహారమును - ఇలా అన్నారు, "మేము మాంసము వండుకొను కుండలయొద్ద కూర్చుండి తృప్తిగా ఆహారము తింటిమి" (16:3). వారు అరణ్యములో సంచారము చేయుచు ఇలా అన్నారు, "ఐగుప్తులో మేము ఉచితముగా తినిన చేపలును కీరకాయలును దోసకాయలును కూరాకులును ఉల్లిపాయలును తెల్లగడ్డలును జ్ఞాపకమునకు వచ్చుచున్నవి" (సంఖ్యా. 11:5). ఐగుప్తులో వారు పొందిన ఆహ్లాదమును వారు ఎక్కువ చేసి చెబుతున్నప్పటికీ, వారు అక్కడి జీవితమును బహుగా ఆనందించారని అది సూచిస్తుంది. దేవుని ఉద్దేశముల కొరకు, ఐగుప్తు గొప్ప సంఖ్యలో జనాభాను అభివృద్ధి చేయుటకు మంచి దేశము.

## ఇశ్రాయేలీయులు అణగద్రొక్కబడెను కాని నాశనముకాలేదు (1:8-22)

### వెట్టిపనులు ఆజ్ఞాపించబడెను (1:8-14)

**[8]అప్పుడు యోసేపును ఎరుగని క్రొత్త రాజు ఐగుప్తును ఏల నారంభించెను. [9]అతడు తన జనులతో ఇట్లనెను - ఇదిగో ఇశ్రాయేలు సంతతియైన యీ జనము మనకంటె విస్తారముగాను బలిష్ఠముగాను ఉన్నది. [10]వారు విస్తరింపకుండునట్లు మనము వారియెడల యుక్తిగా జరిగించుదము రండి; లేనియెడల యుద్ధము కలుగునప్పుడు కూడా మన శత్రువులతో చేరి మనకు విరోధముగా యుద్ధముచేసి యీ దేశములోనుండి, వెళ్లిపోదురేమో అనెను. [11]కాబట్టి వారిమీద పెట్టిన భారములలో వారిని శ్రమపెట్టుటకు వెట్టి పనులు చేయించు అధికారులను వారిమీద నియమింపగా వారు ఫరోకొరకు ధాన్యాదులను నిలువచేయు పీతోము రామెసేసను పట్టణములను కట్టిరి. [12]అయినను ఐగుప్తీయులు వారిని శ్రమపెట్టినకొలది వారు విస్తరించి ప్రబలిరి గనుక వారు ఇశ్రాయేలీయుల యెడల అసహ్యపడిరి. [13]ఇశ్రాయేలీయులచేత ఐగుప్తీయులు కఠినముగా సేవ చేయించుకొనిరి; [14]వారు ఇశ్రాయేలీయులచేత చేయించుకొనిన ప్రతి పనియు కఠినముగా ఉండెను. వారు జిగటమంటి పనిలోను, ఇటుకల పనిలోను, పొలములో చేయు ప్రతిపనిలోను కఠినసేవ చేయించి వారి ప్రాణములను విసికించిరి.**

**వచనము 8. యోసేపును ఎరుగని క్రొత్త రాజు** గద్దెనెక్కుట యొక్క అర్థం, కాలక్రమంలో, ఐగుప్తీయుల కొరకు యోసేపు చేసిన పనులు జ్ఞాపకం లేని లేక మెచ్చుకోని ఒక రాజు (లేక ఫరో) లేచాడని కావచ్చు. యోసేపు దేశమును ఏడు సంవత్సరాల కరువు నుండి కాపాడాడు. ఈ రాజు ఎవరు? దీనికి జవాబు నిర్గమకాండము యొక్క తేదిపై ఆధారపడియున్నప్పటికీ, ఆయనను గూర్చి రెండు సత్యములు చెప్పవచ్చు: (1) పాఠకులకు అతని పేరు బయలుపరచట అవసరమని దేవుడు తలంచలేదు, మరియు (2) అతడు అణగద్రొక్కు సమయంలో జీవించియుండవచ్చు గాని విమోచనకు ముందు మరణించియుండవచ్చు (2:23).

ఈ ఫరో యొక్క గుర్తింపును గూర్చి, రెండు ముఖ్యమైన సాధ్యతలు ఉన్నాయి. నిర్గమకాండమునకు తరువాతి తేదిని (c. క్రీ.పూ. 1290) అంగీకరించినట్లైతే, మోషే ఐగుప్తును విడచినప్పటి ఫరో పేరు Seti I మరియు నిర్గమన సమయంలో ఉన్న ఫరో పేరు రామసేను II. మునుపటి తేదిని అంగీకరించిన యెడల (c. క్రీ.పూ. 1445), మోషే ఐగుప్తును విడచి పారిపోయినప్పటి ఫరో పేరు Thutmose IV మరియు నిర్గమన కాలములోని ఫరో పేరు Amenhotep II.[3]

ఈ "క్రొత్త రాజు"కు క్రీ.పూ. 1670 నుండి 1550 మధ్య ఐగుప్తును పాలించిన Hyksosతో సంబంధం ఉంది అని కొందరు భావిస్తారు. సెమిటీయుడైన Hyksos ఐగుప్తును ఆ కాలంలో పరిపాలిస్తున్నాడు కాబట్టి అతడు యాకోబు కుటుంబాన్ని ఆహ్వానించాడని ఒక ఆలోచన. తరువాత, "యోసేపును ఎరుగని" సెమిటీయుడు కాని, ఐగుప్తీయుడైన రాజు గద్దెనెక్కినప్పుడు, అతడు ఇశ్రాయేలీయుల పట్ల కనికరము

చూపక వారిని బానిసలుగా చేశాడు. "యోసేపును ఎరుగని" ఫరో Hyksos నాయకుడు అని, మరియు యాకోబు కుటుంబాన్ని ఐగుప్తీయులు ఆహ్వానించారని కాని Hyksos వారిని బానిసలుగా చేశాడని మరి కొందరు వాదిస్తారు.

**వచనము 9.** ఇశ్రాయేలీయులు ఐగుప్తీయుల కంటే **విస్తారముగాను బలిష్ఠముగాను** ఉన్నారని ఫరో చెప్పినప్పుడు, అతడు అతిశయోక్తితో కూడిన మాటను ఎక్కువ చేసి మాట్లాడుతున్నాడు. అయితే, అతని భయం మాత్రం నిజం. అతడు ఎందుకు కలతచెందాడు? ఇశ్రాయేలును గూర్చి ఐగుప్తు యొక్క భయం, Hyksos వంటి పరదేశులు మునుపు వారిపైన దండెత్తిన దానిపై ఆధారపడియుందని కొందరు పండితులు నమ్ముతారు. దీని వలన ఐగుప్తీయులు భయముతో నింపబడ్డారు; మరొక సారి వేరే దేశం ద్వారా జయించబడు భయంతో వారు నిండియున్నారు. ఒక విరోధ దేశము - ముఖ్యంగా యాకోబు సంతతివారికి బంధువులైన సెమిటిక్ రాజ్యము వారు - ఐగుప్తు దేశముపై దాడి చేసినయెడల, వారి మధ్యలో నివసించుచున్న ఇశ్రాయేలీయులు ఐగుప్తీయులను జయించుటకు ఆ దేశములో జతకలిసే అవకాశం ఉంది.

**వచనము 10.** అట్టి త్వరిత ఎదుగుదలకు స్పందనగా, ఇశ్రాయేలు ప్రజలను బానిసలుగా చేయుట ద్వారా వారితో **యుక్తిగా వ్యవహరించాలని** (חָכַם, *chakam*) రాజు ప్రతిపాదించాడు. అట్టి అవినీతిని "యుక్తిగా" ఎలా చేయవచ్చు? "వివేకమును" గూర్చి పాత నిబంధన ఆలోచనలో ఒక కార్యమును విజయవంతముగా ముగించు శక్తి కూడా ఇమిడియుంది. సాధారణంగా జ్ఞాని ఎల్లప్పుడూ నీతిపరునిగా ఎంచబడినప్పటికీ, వివేకము అవినీతి ఉద్దేశముల కొరకు కూడా ఉపయోగించవచ్చు. ఇందు వలన హెబ్రీ పదమును "కుయుక్తి" అని కూడా అనువదించవచ్చు (2 సమూ. 13:3). ఐగుప్తీయుల ఆలోచన ప్రకారం, ఇశ్రాయేలీయులను బానిసలుగా చేయుట తమ ఉద్దేశములను నెరవేరుస్తుంది కాబట్టి అది వివేకవంతమైన పని.

**వచనము 11.** ఇశ్రాయేలీయుల యొక్క **వెట్టి పనుల** వెనుక ఏ నిజ జీవిత సన్నివేశాలు ఉన్నాయి? ఐగుప్తు సైన్యము ఒక్కసారిగా వచ్చి, తలుపులు పగులగొట్టి బలమైన పురుషులనందరిని పని చేయు స్థలములకు ఈడ్చుకుపోయారా? పని చేయుటకు పురుషులు కావాలని, మరియు చేయని యెడల శిక్ష విధించబడుతుందని ప్రకటనలు అంటించారా? వాక్యభాగములో ఈ వివరములు లేవు. అయితే, ఇశ్రాయేలు బానిసలు [రెండు] **నిలువచేయు పట్టణములైన పీతోము రామెసేసను కట్టారని** బయలుపరుస్తుంది. ఈ రెండు పట్టణములు తూర్పు డెల్టా ప్రాంతములో ఉన్నాయి, కాని వాటి ఖచ్చిత స్థానము ఇప్పటికీ వివాదాస్పదమైనదే. నిర్గమనకు తదుపరి తేదిని అనుసరించువారు, దీనిని రామెసేసు II నిర్మించి తన పేరు పెట్టుకున్న "రామెసేసు" పట్టణముగా గుర్తిస్తారు. మొదటి తేదిని సమర్థించు ఇతరులు "రామెసేసు" అను పేరు యాకోబు మరియు అతని కుటుంబము స్థిరపడిన ప్రాంతమును గుర్తించుటకు ఉపయోగపడింది అని చెబుతారు (ఆది. 47:11), కాని ఈ సన్నివేశం రామెసేసు సామ్రాజ్యమునకు చాలా కాలం ముందు జరిగింది. కొందరు రచయితలు "పీతోము"ను బైబిల్ లోని సుక్కోతుతో గుర్తిస్తారు (12:37; 13:20; సంఖ్యా. 33:5, 6), కాని ఇతరులు ఈ రెండు పట్టణాల మధ్య తేడా చూపిస్తారు.

**వచనము 12.** బానిసత్వము ఫరో కోరినదానికి వ్యతిరేక ప్రభావమును చూపింది. ఇశ్రాయేలీయులు సంఖ్యలో తగ్గుటకు బదులు **విస్తరించి ప్రబలిరి.** నిర్గమకాండము యొక్క ముఖ్యమైన అంశములోని మొదటి ప్రతిపాదన ఇది: దేవుడు తన ప్రజలతో ఉన్నాడు మరియు తన చిత్తమును ఆయన నెరవేర్చుతాడు. ఫరో లేక ఐగుప్తీయులు చేయు ఏదీ కూడా ఆయన ఉద్దేశములకు భంగం కలిగించలేదు.

**వచనములు 13, 14.** ఐగుప్తు పాలకులు ఇశ్రాయేలుకు ఆటంకం కలిగించుటకు వారి కృషిని రెట్టింపు చేశారు. ఇశ్రాయేలీయులను గాయపరచుటకు వారు చేసినవాటిని వివరించుటకు రచయిత పలు భావములను ఉపయోగించాడు. **ఇశ్రాయేలీయులచేత ఐగుప్తీయులు *కఠినముగా* సేవ చేయించుకొనిరి; వారు ఇశ్రాయేలీయులచేత చేయించుకొనిన ప్రతి పనియు *కఠినముగా* ఉండెను. వారు . . . ప్రతిపనిలోను కఠినసేవ చేయించి వారి ప్రాణములను విసికించిరి** (వక్కాణం జతపరచబడెను). అయితే, "కఠినమైన" మరియు "విసిగించు" పని ఇశ్రాయేలీయుల ఎదుగుదలను ఆపలేకపోయాయి, మరియు మరొక చర్య తీసుకొనుట అవసరమని ఫరో భావించాడు.

## క్రొత్తగా జన్మించిన మగ శిశువులను చంపాలని ఆజ్ఞ (1:15-22)

**[15]మరియు ఐగుప్తురాజు షిఫ్రా పూయా అను హెబ్రీయుల మంత్రసానులతో మాటలాడి [16]- మీరు హెబ్రీ స్త్రీలకు మంత్రసానిపని చేయుచు వారిని కాన్పుపీటల మీద చూచినప్పుడు మగవాడైనయెడల వాని చంపుడి, ఆడుదైనయెడల దాని బ్రదుకనియ్యుడని వారితో చెప్పెను. [17]అయితే ఆ మంత్రసానులు దేవునికి భయపడి, ఐగుప్తురాజు తమ కాజ్ఞాపించినట్లు చేయక మగపిల్లలను బ్రదుకనియ్యగా [18]ఐగుప్తురాజు ఆ మంత్రసానులను పిలిపించి - మీరెందుకు మగపిల్లలను బ్రదుకనిచ్చితిరి? ఈ పని యేల చేసితిరి అని అడిగెను. [19]అందుకు ఆ మంత్రసానులు - హెబ్రీ స్త్రీలు ఐగుప్తు స్త్రీలవంటివారు కారు; వారు చురుకైనవారు. మంత్రసాని వారియొద్దకు వెళ్లక మునుపే వారు ప్రసవించి యుందురని ఫరోతో చెప్పిరి. [20]దేవుడు ఆ మంత్రసానులకు మేలుచేసెను. ఆ జనము విస్తరించి మిక్కిలి ప్రబలెను. [21]ఆ మంత్రసానులు దేవునికి భయపడినందున ఆయన వారికి వంశాభివృద్ధి కలుగజేసెను. [22]అయితే ఫరో - హెబ్రీయులలో పుట్టిన ప్రతి కుమారుని నదిలో పారవేయుడి, ప్రతి కుమార్తెను బ్రదకనియ్యుడి అని తన జనులందరికి ఆజ్ఞాపించెను.**

**వచనము 15.** ఇప్పటి వరకు, దేవుడు ఎన్నుకున్నటువంటి ప్రజలు "ఇశ్రాయేలీయుల సంతానం" (1:7, 9, 12, 13) లేదా "ఇశ్రాయేలీయులు" (NRSV). మిగతా అధ్యాయమంతా, **హెబ్రీ** అను పదము **మంత్రసానులను** మరియు స్త్రీలను సూచిస్తుంది (1:15, 16, 19). ("హెబ్రీయులు" NRSV యొక్క వచనము 22లో కూడా కనిపిస్తుంది.) "హెబ్రీ" అను పేరునకు అక్షరార్థంగా "మరోవైపు నుండు వారు" అని అర్థం మరియు యూఫ్రటీసు నదికి తూర్పున, ఊరు నుండి అబ్రాహాము యొక్క వలసను ప్రతిబింబిస్తుంది (యెహో. 24:2, 3 చూడండి).[4] ఇతర ఆధారాలు ఈ విధంగా

సూచిస్తాయి, "హెబ్రీ" అను పదము "'ఇశ్రాయేలు' అను పదము కంటే కూడా పురాతనమైనది మరియు విస్తృతమైన పదము," విదేశీయులు అబ్రాహాముతో లేదా అబ్రాహాము ప్రజలను గూర్చి మాట్లాడేడప్పుడు ఈ పదము ఉపయోగించేవారు (ఆది. 39:14, 17; 40:15), "హెబ్రీ" (עִבְרִי, *'ibri*) అను పదము ఆదికాండము 10:21లో షేము కుమారుడైన "ఏబెరు" (עֵבֶר, *'eber*) నుండి వచ్చిందని గుర్తించవచ్చు.[5] అయితే, Nahum M. Sarna, ఈ పేరు యొక్క మూలం "ఒక రహస్యంగానే ఉండాలి" అని చెప్పి ఈ చివరి ఆలోచనను తిరస్కరించారు.[6]

ఈ కథ యొక్క ఆసక్తికరమైన విషయం ఏంటంటే కేవలం **షిఫ్రా** మరియు **పూయా** అను ఇద్దరు మంత్రసానుల పేర్లు మాత్రమే చెప్పబడ్డాయి. లక్షలాదిమంది ప్రజలకు కేవలం ఇద్దరు మంత్రసానులే సరిపోతారా? అత్యంత సహజమైన వివరణ ఏంటంటే ఇశ్రాయేలీయులలోనున్న మంత్రసానులందరికి ఈ ఇద్దరు స్త్రీలు బాధ్యులు.

**వచనము 16.** బానిసకు అదనంగా, ఫరో యొక్క మరొక పద్ధతి ఏంటంటే జన్మించిన ఇశ్రాయేలీయుల మగశిశువులను చంపడానికి హెబ్రీ మంత్రసానులు అవసరం. **కాన్పుపీటల మీద** (עַל־הָאָבְנָיִם, *'alha'abnayim*) అక్షరార్థంగా "రాయిల పైన" అని అర్థం ఇది స్పష్టంగా "స్త్రీలు జన్మనిచ్చుటకు సంప్రదాయకంగా ఉంచబడిన పీటను సూచిస్తుంది."[7] **మగవాడైన** (వారైన) **యెడల** చంపబడాలి ఎందుకంటే వారు "సంభావ్యయోధులు మరియు తిరిగుబాటుదారులు," కానీ **ఆడుదైన** (వారైన) **యెడల** బ్రతుకనియ్యాలి ఎందుకంటే వారు ఐగుప్తీయులకు పిల్లలను కానీ, ఐగుప్తీ జనాభాను పెంచుతారు.[8]

**వచనము 17.** మంత్రసానులు ఫరోకు విధేయత చూపలేదు ఎందుకంటే **వారు దేవునికి భయపడ్డారు.** ఈ స్త్రీలు "హెబ్రీ మంత్రసానులుగా" పిలువబడి మరియు హెబ్రీ (Semetic) పేరులు కలిగియున్నారు (1:15) కాబట్టి, వారు బహుశా ఇశ్రాయేలీయులు; అందుచేత వారు "దేవునికి భయపడ్డారు" అనడంలో ఆశ్చర్యం లేదు. నిర్గమకాండంలో "దేవుడు" పేరుతో పిలువబడడం ఈ వచనంలోనే ప్రత్యేకంగా మొదటిగా కనిపిస్తుంది, కానీ ఇంతకు ముందు జరిగిన వాటన్నిటిలో దేవుని దైవాకృతమైన హస్తము ఉంది. ప్రజలు దేవుని యందు విశ్వాసముంచారు కాబట్టి, ఫరో మరోసారి ఓడిపోయాడు!

**వచనములు 18, 19.** తన ఆజ్ఞను వారు ఎందుకు గైకొనుటలేదని ఫరో అడిగినప్పుడు, **మంత్రసాని వారియొద్దకు వెళ్లకమునుపే హెబ్రీ స్త్రీలు ప్రసవించి యుందురని** చెప్పి మంత్రసానులు అబద్ధం చెప్పారు. మంత్రసానులు చెప్పిన జరుగని కథను ఫరో అంగీకరించాడు, ఇది కథనమునకు హాస్యమును జతచేస్తుంది. ఫరో "యుక్తిగా" (1:10) ఉండాలని అనుకొన్నాడు, కానీ ఆయన ప్రశ్నకు మంత్రసానులు చెప్పిన వివేక స్పందనను నమ్మడానికి సరిపోయిన మూర్ఖుడు. Terence E. Fretheim ఈ విధంగా చెప్పాడు, "ఫరో రాజును, జ్ఞానం యొక్క శ్రేష్టతను ఒకే ప్రశంసతో ఇద్దరు దాసులైన స్త్రీలు నోరుమూయించారు! వాస్తవంగా, ఇది హాస్యం, ఎందుకంటే తన రాజదండనకు యోగ్యుడైన ఏ రాజు కూడా ఈ స్పందనను సంతృప్తికరంగా భావించడు, మంత్రసానుల వలన మాత్రమే సాధ్యమైనది."[9]

**వచనములు 20, 21.** పర్యవసానంగా, ఫరో ప్రణాళిక పని చేయలేదు.

ఇశ్రాయేలీయులు **విస్తరించి మిక్కిలి ప్రబలిరి**, మరియు దేవుడు మంత్రసానులను ఒక ప్రత్యేకమైన విధంలో దీవించాడు: **దేవుడు ఆ మంత్రసానులకు మేలు చేసెను** మరియు **వారికి వంశాభివృద్ధి కలుగజేసెను.** NRSV చెప్తుంది, దేవుడు "వారికి కుటుంబాలను ఇచ్చాడు," అంటే బహుశా ఇంతకుముందు పిల్లలును కనలేని పరిస్థితిలో వారున్నారని తెలియజేస్తుంది.

ఈ వాక్యభాగం జనాభా పెరుగుదలను గూర్చి మాట్లాడుతుంది. ఇశ్రాయేలీయులు విస్తరించబడ్డారు; తదుపరి వారు పెరుగకుండ ఉండుటకు ఐగుప్తీయులు ప్రయత్నించారు, కానీ ఫరో కొలమానాలు పని చేయలేదు. ఇశ్రాయేలీయులను గొప్ప జనాంగముగా చేయాలను దేవుని ప్రణాళికను మంత్రసానులు చేపట్టినప్పుడు, వారి కొరకు పెద్ద కుటుంబాలను ఇస్తానను అభయమును పొందుకొన్నారు.[10] దేవుని ఆమోదం యొక్క సూక్ష్మ సూచన వాక్యభాగంలో వారు గుర్తించబడ్డారన్న వాస్తవంలో కనబడుతుంది. గుర్తించబడని ఫరోకు విరుద్ధంగా ఇది వారికి "గౌరవమును మరియు ప్రాముఖ్యతను ఇస్తుంది.[11] పశ్చిమ ఆసియాలో గొప్ప దేశము యొక్క గొప్ప చక్రవర్తి ఐగుప్తు రాజైన ఫరో ప్రణాళిక, దేవునిచే ప్రాముఖ్యంగా ఎంచబడిన ఇద్దరు మంత్రసానుల చేత నిరోధించబడింది.

మంత్రసానుల అబద్ధం గురించి ఏమి చెప్పగలము? బహుశా, ఇది ఎంతమాత్రము అబద్ధం కాదు; బహుశా మంత్రసానులు వారికి సహాయం చేయుటకు వచ్చేలోపే హెబ్రీ స్త్రీలు తమ బిడ్డలను కంటున్నారు. వ్యాఖ్యానకర్తలు ఈ విధంగా చెప్తున్నారు, పురావస్తు సాక్ష్యాలు అభిప్రాయం ఏంటంటే ఐగుప్తు స్త్రీల కంటే హెబ్రీ స్త్రీలు పెద్దవారు మరియు గట్టివారు, కానీ మంత్రసానులు రాజును మోసం చేయుటకు చూచారనడాన్ని ఇది రుజువు చేయలేదు. జన్మనివ్వబోవు స్త్రీలకు సహాయం చేయుటకొరకు మంత్రసానులు వెళ్లకుండా బిడ్డల్ని కనేవరకు ఆలస్యం చేశారు. అయినను, అలాటి పరిష్కారం, పరిష్కరించుట కంటే మరింత సమస్యను తెచ్చింది.

ఒకరు సగం సత్యం చెప్పుటకు గల క్లిష్ట పరిస్థితిలో దేవుడు ఆ అబద్ధము చెప్పు వాని యొక్క ఉద్దేశాలను మరియు పరిస్థితిని ఆమోదిస్తాడు అని కొంతమంది వాదించవచ్చు. అయితే, మంత్రసానులు అబద్ధము చెప్పారని గుర్తించడానికి ఇది చాలును. ఆ అబద్ధముపై బైబిల్ దానియొక్క దీవెనలను కురిపించదు, కానీ ఆ కథనములో ఒక భాగంగా చెప్తుంది. ఈ కోణంలో, మంత్రసానులు అబద్ధము చెప్పిన కారణాన దేవుడు వారికి బహుమతినియ్యలేదు, గానీ ఇశ్రాయేలీయుల శిశువులను చంపుటకు తిరస్కరించిన విధానాన్ని బట్టి దీవించెను అని మనం చెప్పగలము. అబద్ధమును సమర్థించవలసిన అవసరం లేదు (ప్రేరేపించబడిన రచయిత దానిని సమర్థించలేదు గనుక), అలాటి పరిస్థితిలో ఈనాటి క్రైస్తవులు అబద్ధం చెప్పుటకు ఇది ఒక దృష్టాంతంగా కూడా లేదు.

**వచనము 22.** Masoretic[12] వాక్యమును అనుసరించిన, NASBలో **పుట్టిన ప్రతికుమారుడు నైలు నదిలో పడవేయమని** చెప్పినప్పుడు వారు హెబ్రీయుల కుమారులని చెప్పబడలేదు. అయితే, ఇతర పాత నిబంధన సాక్ష్యములను అనుసరించు,[13] కొన్ని వెర్షన్లు, ఆ మగబిడ్డలు హెబ్రీయుల కుమారులని చెప్తున్నాయి.

NRSVలో ఈ విధంగా చదువబడుతుంది, “హెబ్రీయులకు పుట్టిన ప్రతి కుమారుడు నైలు నదిలో పడవేయబడాలి, కానీ ప్రతి కుమార్తెను బ్రతుకనివ్వాలి.”

అప్పుడు **ఫరో** ఆజ్ఞను జారీ చేశాడు ఆ ఆజ్ఞ ఒక వైపు ఇశ్రాయేలీయులకు దుఃఖము కలిగిస్తుంది మరియు మరో వైపు ఇశ్రాయేలీయులను చెరలో నుండి విడిపించుటకు దేవుడు ఉపయోగించుకొను వ్యక్తిని అభివృద్ధి చేస్తుంది. తరువాత ఐగుప్తీయుల యొక్క జ్యేష్ఠ కుమారుల మరణం (12:29, 30) చాలా కాలం తరువాత ఫరో అనేక మంది ఇశ్రాయేలీయుల అమాయక పిల్లలను చంపుట ద్వారా చేసిన నేరమునకు ఇది ఒక శిక్షగా పరిగణించబడింది. తరువాత సందర్భంలో, ప్రత్యర్థి రాజు వయస్సులో పెరుగకుండా ఉండుటకు మరొక రాజు చిన్న పిల్లలందరినీ చంపించాడు (మత్తయి 2:16)!

## అన్వయము

### దేవునికి వ్యతిరకంగా చేసే పోరాటం వ్యర్థం (అధ్యా. 1)

James Weldon Johnson ఒక పద్యమును - ఒక ఉపన్యాస వచనములో - తప్పిపోయిన కుమారునిపై ఈ పదాలతో ప్రారంభించాడు: “యౌవ్వనుడా, యౌవ్వనుడా, దేవునితో పోరాడుటకు నీ చేతులు చాలా చిన్నవి.”[14] ఆ వచనాలు మనసులో అతుక్కుపోయి ఉంటాయి ఎందుకంటే వాటి యొక్క స్పష్టమైన చిత్రం వలన. చిన్న చేతులతో ఒక బాక్సర్ (boxer) పెద్ద చేతులున్న ప్రత్యర్థిని కొట్టుటకు ప్రయత్నిస్తున్నట్లు గీసిన చిత్రము. మధ్య యుగంలో ఇద్దరు పురుషులు కవచమును ధరించి మరియు మృషామృధం పోటీలో గుర్రాలపై యెక్కి ఉన్న చిత్రాన్ని ఊహించండి. ఒకని యొద్ద పన్నెండు అడుగుల బల్లెము మరియు ఇంకొకరి యొద్ద ఆరడుగుల బల్లెము ఉంది! అదే విధంగా, పూర్తిగా సరిపోని రెండు క్రీడా జట్లను గూర్చి మనం ఆలోచించాలి. ఉదాహరణకు, 2003లో రగ్బీ వరల్డ్ కప్ సిరీస్ లో, ఆస్ట్రేలియా జట్టు నమీబియాను 142-0తో ఓడించింది. కవి Johnson ఈ విధంగా చెప్తున్నాడు, మనం దేవునికి వ్యతిరేకంగా పోరాడినప్పుడు, మన పరిస్థితి అంతే. మనం విజయం పొందుటకు వేరే మార్గం లేదు.

దేవునికి వ్యతిరేకంగా పోరాడుటలో వ్యర్థమవడం అనేది నిర్గమకాండంలో మంచిగా వర్ణించబడింది. ఈ పుస్తకంలో చెప్పబడిన కథ ప్రథమంగా అద్వితీయ సత్య దేవునికి మరియు ఐగుప్తీయుల దేవుళ్లకు మధ్య జరిగే కథ. మనం దీనిని దేవుడుగా పరిగణించబడిన ఫరోకు మరియు అద్వితీయ సత్య దేవునికి మధ్య జరిగేదిగా చూడవచ్చు. వాస్తవంగా, చివరకు, దేవుడు యుద్ధమును గెలచాడు. ఇశ్రాయేలు విమోచించబడింది, మరియు ఫరో దేవుని శక్తిని గుర్తించాడు.

నిర్గమకాండము యొక్క మొదటి అధ్యాయము కథను సమీక్షార్థంగా చూపుతుంది. ఇక్కడ, దేవుని ప్రజలను ఓడించుటకు మరియు దేవునిని ఓడించుటకు ఫరో తీవ్రమైన కృషి చేశాడు, కానీ ప్రతి ప్రయత్నంలో అతడు ఓడిపోయాడు.

1. *ఫరో వారిని బానిసలనుగా చేశాడు.* ఎందుకు? ఎందుకంటే ఆయన వారికి

భయపడ్డాడు. ఫలితం ఏమిటి? ఇశ్రాయేలీయులు విస్తరించి మరియు ప్రబలిరి (1:12).

2. *ఫరో వారి పనిని మరింత కఠినం చేశాడు.* తన యొక్క మొదటి ప్రయత్నము తన ప్రణాళికను నెరవేర్చలేదని అతడు గ్రహించినప్పుడు, ప్రజల పనిని ఫరో మరింత కఠినం చేశాడు (1:13, 14). స్పష్టంగా, ఫరో మరిన్ని ప్రయత్నాలు చేయడానికి పూనుకున్నాడు కాబట్టి అది కూడా పని చేయలేదు.

3. *మగబిడ్డలను చంపమని ఫరో మంత్రసానులకు ఆజ్ఞాపించెను* (1:15, 16). ఫరోకు విధేయత చూపుటకు మంత్రసానులు తిరస్కరించిరి ఎందుకంటే వారు "దేవునికి భయపడిరి" (1:17-21), మరియు దేవుడు ఈ మంత్రసానులను గౌరవించెను. ఆయన "కుటుంబాలను" ఇచ్చుట ద్వార (NRSV) "వారికి వంశాభివృద్ధి కలుగజేసెను" (1:21). అదనంగా, వారి కథలను భావితరముల కొరకు ఆయన భద్రపరచాడు. (గమనించండి ఈ స్త్రీల పేర్లు నిర్గమకాండంలో నమోదుచేయబడ్డాయి కాని ఫరో పేరు నమోదుచేయబడలేదు.) ఫరో యొక్క శక్తివంతమైన ప్రణాళిక ఇద్దరు దాసీలైన మంత్రసానుల ద్వార నిరోధించబడింది!

4. *మగశిశువులను నైలు నదిలో పడవేయాలని ఫరో ఆజ్ఞాపించాడు* (1:22). అంటే, ఫరో తన ప్రణాళికలో ఈసారి విజయవంతుడయ్యాడు. అయితే, తరువాత, ఈ హత్యలకు పర్యవసానంగా ఐగుప్తీయులు తమ జ్యేష్ఠ కుమారులను ఇస్తారు (4:23)! మరొక విధంగా, వ్యూహం ఎగసిపడింది, ఎందుకంటే ఫరో ఖర్చుతో ఫరో ఇంట్లోనే తన సొంత హెబ్రీ తల్లి చేతనే పెంచబడి ఇశ్రాయేలీయులను విమోచించడానికి దేవుడు ఒక విమోచకుడను లేవనెత్తాడు! దేవుడు తన ప్రణాళికను నెరవేర్చడానికి వీటన్నిటిలో తెర వెనుకనుండి పని చేస్తున్నాడు.

దేవునికి వ్యతిరేకంగా పోరాడడం వ్యర్థం. ఈ లోకంలో నున్న చెడు శక్తులు, అవి ఇప్పుడు విజయం సాధిస్తున్నట్లుగా కనిపిస్తున్ననూ, చివరకి అవి ఓడించబడతాయి! (అది ప్రకటన గ్రంథం యొక్క అంశము.) దేవునిని ఓడించాలనే ఫరో యొక్క వ్యర్థమైన ప్రయత్నములు, మనుష్యులు దేవునికి వ్యతిరేకంగా పోరాడి విజయమును సాధించలేరనుటకు రుజువు. శిక్ష పడుతుందనే భయం లేకుండా మనం పాపం చెయ్యొచ్చునన్న ఆలోచనలతో కార్యాలను జరిగించినప్పుడు, మనం దేవునికి వ్యతిరేకంగా పాపం చేసి మరియు చిక్కుకోలేము అనుకొన్నప్పుడు మనం దేవునికి వ్యతిరేకంగా పోరాడతాము. దేవుడు శ్రద్ధ వహిస్తున్న దానినుండి మనము ఎప్పుడూ కూడా "తప్పించుకోలేము." ఆయన తన విశ్వంలో పరిణామాల నియమమును ఏర్పాటు చేశాడు: "మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును" (గలతీ. 6:7). సృష్టికర్తకు వ్యతిరకంగా చేసిన ప్రతి కార్యమునకు మనం లెక్క అప్పగించుటకు పిలువ*బడతాము.*

విత్తుటకు మరియు కోయుటకు గల దేవుని చట్టం అనూహ్యామైనది. అయితే, ధర్మశాస్త్రమునకు పైనున్న దానిని ఆయన మనకు ఇచ్చెను. మన పాపం యొక్క అంతిమ పరిణామాలను అనుభవించుట నుండి మనము తప్పించుకోగలము ఎందుకంటే క్రీస్తు మన కొరకు మరణించాడు. మారుమనస్సు పొంది మరియు విధేయతతో క్రీస్తు నొద్దకు వచ్చిన యెడల, దేవుని కృప చేత మరియు క్రీస్తు రక్తములో మన రుణాలు కొట్టిపేయబడతాయి.

## ఇశ్రాయేలీయుల దాస్యం మరియు దేవుని దైవసహాయము (1:1-14)

ఇశ్రాయేలు ఐగుప్తులో ఎందుకు ఉన్నాడు? తన సోదరులు అతనిని ఐగుప్తీయులకు అమ్మివేసినప్పుడు, వారు కీడు చేయ నుద్దేశించిరి గాని ". . . బహు ప్రజలను బ్రతికించునట్లుగా అది మేలుకే దేవుడు ఉద్దేశించెను" (ఆది. 50:20) అని యోసేపు చెప్పాడు. కరువు కాలంలో యోసేపు మరియు మిగిలిన యాకోబు కుటుంబ సభ్యులు ఐగుప్తులో ఉండుటకు దేవుడు తన దైవాధీనములో సిద్ధపరచాడు. అయితే, కథంతా కేవలం యోసేపు సమాధానం మాత్రమే కాదు. తన ప్రజలను బ్రతికించాలని దేవుడు కోరుకొన్నట్లైతే, ఆయన కరువును తప్పించేవాడు. తన ప్రజలు ఐగుప్తులో ఉండాలని దేవుడు కోరుకొన్నాడు. ఎందుకు? (1) తద్వారా వారు అక్కడ విస్తరించబడాలని. (2) తద్వారా వారిని ఐగుప్తు నుండి విమోచించి ఆయన శక్తిని మరియు కృపను వారు అర్థం చేసుకొనుటకు సహాయపడుట కొరకు.

## స్త్రీల ప్రాముఖ్యత (1:15-22)

దేవుని ప్రజలను భద్రపరచుటలో మరియు విడిపించుటలో స్త్రీలు ప్రాముఖ్యమైన పాత్ర వహించారని నిర్గమకాండము చూపిస్తుంది. హెబ్రీ మగశిశువులను చంపాలను ఫరో ప్రణాళికను ఇద్దరు మంత్రసానులు నిరోధించారు (1:15-22). మోషే తల్లి తన కుమారుడను రక్షించుటకు నదిపై ఒక ఓడలో తన కుమారుని ఉంచెను. ఐగుప్తు రాకుమారి శిశువును కనుగొని మరియు ఆయనను ఉంచుకొనుటకు నిర్ణయించుకొనెను. ఆయన కనుగొనబడేవరకు మోషే సహోదరి ఆ చిన్న బాబును వీక్షిస్తూనే ఉంది (2:1-10). అరణ్యంలో మోషే కొరకు గృహమును ఏర్పాటు చేసిన యిత్రో కుమార్తె గురించి (2:16-22) మరియు సిప్పోరా తన కుమారునికి సున్నతి చేసిన ఫలితంగా మోషే ప్రాణం రక్షించబడడం (4:24-26) అనేవి దీనికి జత చేయవచ్చు. బహుశా స్త్రీల ప్రాముఖ్యతను గూర్చి మరి ప్రత్యేకంగా జీవితాలను కొనసాగించి కాపాడుటలో వారి పాత్రను గూర్చి మనకు చెప్పడానికి దేవుడు ప్రయత్నిస్తున్నాడు.

---

సూచనలు

[1]Gleason L. Archer, Jr., *Encyclopedia of Bible Difficulties* (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1982), 378. [2]Ibid., 379. [3]Gleason L. Archer, Jr., *A Survey of Old Testament Introduction*, rev. and exp. (Chicago: Moody Press, 1994), 244-46. [4]Francis Brown, S. R. Driver, and Charles A. Briggs, *The Brown-Driver-Briggs Hebrew and English Lexicon* (Boston: Houghton, Mifflin and Co., 1906; reprint, Peabody, Mass.: Hendrickson Publishers, 1997), 720. [5]నిర్గమ. 1:15పై గమనికలు, Bruce M. Metzger and Roland E. Murphy, eds., *The New Oxford Annotated Bible with the Apocrypha*, rev. and enl. (New York: Oxford University Press, 1991), 70; Alfred Haldar, "Hebrew," in *The Interpreter's Dictionary of the Bible*, ed. George Arthur Buttrick (Nashville: Abingdon Press, 1962), 2:552. Anson F. Rainey ఈ విధంగా వ్రాసాడు

పదము “స్పష్టంగా ఒక జాతికి లేక జాతీయ సమూహము గూర్చి చెప్పుటకు ఒక హోదా [బిరుదు]ను సూచిస్తుంది.” (Anson F. Rainey, “Hebrews,” in *Harper's Bible Dictionary*, ed. Paul J. Achtemeier [San Francisco: Harper & Row, 1985], 379.) [6]Nahum M. Sarna, *Exploring Exodus: The Origins of Biblical Israel* (New York: Schocken Books, 1996), 54-55. [7]Umberto Cassuto, *A Commentary on the Book of Exodus*, trans. Israel Abrahams (Jerusalem: Magnes Press, 1997), 14. [8]Waldemar Janzen, *Exodus*, Believers Church Bible Commentary (Scottdale, Pa.: Herald Press, 2000), 38. [9]Terence E. Fretheim, *Exodus*, Interpretation: A Bible Commentary for Teaching and Preaching (Louisville: John Knox Press, 1991), 34. [10]Janzen, 39.

[11]Ibid. [12]“Masoretic text” (MT) అను పదము “Masoretes (లేదా Masorites) అనగా వాక్యభాగాల సంప్రదాయం యొక్క అధీకృత ఉపాధ్యాయులు చేత విరామ చిహ్నాల కొరకు వ్యాఖ్యానంలో (స్వరాలతో) మరియు గొంతుకతో [పాత నిబంధన] నుండి అందుకొన్నదానిని సూచిస్తుంది” (Richard N. Soulen and R. Kendall Soulen, *Handbook of Biblical Criticism*, 3d ed., rev. and exp. [Louisville: Westminster John Knox Press, 2001], 109). [13]చదువుటకు ఆధారంగా, NRSV Samaritan Pentateuch, the Septuagint, and the Aramaic Targums (రబ్బీయుల అనువాదమును ప్రతిబింబించు హెబ్రీ వాక్యభాగాల అనువాదాలు) ఉదాహరిస్తుంది. [14]James Weldon Johnson, *God's Trombones* (New York: Viking Press, 1927; reprint, New York: Penguin Books, 1976), 21.